క్లుప్తంగా

హక్కుల సాధనకై త్వరలో ఉద్యమం



కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నర్సింహులు

నారాయణఖేడ్: దళితుల సంక్షేమం, హక్కుల సాధన కోసం త్వరలో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు తెలిపారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ అంబేద్కర్ భవన్ ఎదుట సోమవారం మహనీయుల చిత్రపటాలకు పూలమాలలువేసి కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, బలహీనవర్గాలకు రక్షణ కరువైందన్నారు. మహనీయుల ఆశయసాధనకు తమ సంఘం నిరంతరం కృషిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ, అంబేద్కర్ పూలే సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడికి పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న ట్రస్టు సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో సిద్ధి వినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకటలాడాయి. సంకష్టహర చతుర్థినాడు స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందులో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా సమీప కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కిసాన్ సంఘ్ తీర్మానాలు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సంగారెడ్డి అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పసుపు బోర్డు ఏర్పాటును ప్రకటించిన ప్రధాన మంత్రికి, రైతురుణ మాఫీ చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు, రైతు సమస్యలపై 9వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో సంఘ్ ప్రధాన కార్యదర్శి పి.సదానందరెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, మురళీధర్ రెడ్డి,మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, రామచంద్రరెడ్డి, ఆశిరెడ్డి, వి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక




కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కండువా వారికి కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మునిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంతూర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సోమవారం అన్నదానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సంస్థ సభ్యులు హాస్పటల్ సిబ్బందికి, రోగులకు, బాటసారులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న సభ్యులు

గాంధీకి ఘన నివాళి

మహాత్మా గాంధీ 154వ జయంతిని పట్టణాలు, పల్లెల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సేచ్ఛా, స్వాత్రంత్ర్యాల కోసం అహింసా పద్ధతిలో శాంతియుతంగా పోరాటం చేసిన మహనీయుడు గాంధీ అని వక్తలు కొనియాడారు. గాంధీ ఎంచుకున్న శాంతి అహింసా మార్గం ప్రపంచానికే స్ఫూర్తినిచ్చిందన్నారు.



పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్‌చెరు టౌన్: గాంధీకి నివాళులర్పిస్తున్న గీతం ప్రొఫెసర్లు



న్యాల్‌కల్‌లోని ఎంపీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ



బొల్లారంలో గాంధీ జయంతి వేడుకల్లో చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



రామచంద్రాపురంలో నివాళులర్పిస్తున్న మాజీ శాసనమండలి ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి



నారాయణఖేడ్‌లో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు



జహీరాబాద్ టౌన్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



సదాశివపేటలో నివాళలర్పిస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

గాంధీకి అంగన్‌వాడీల వినతి



నారాయణఖేడ్‌లో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



సదాశివపేటలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సంగారెడ్డి టౌన్: అంగన్ వాడీలపై ప్రభుత్వ వేధింపులు ఆపాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, అంగన్ వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నారాయణఖేడ్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి చిరంజీవి, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి అంగన్‌వాడీ వినతి పత్రం సమర్పించారు.

మునిపల్లి(అందోల్): తమ సమస్యలు పరిష్కరించాని అంగన్‌వాడి టీచర్లు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందున్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు.

జహీరాబాద్ టౌన్: అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆరోపించారు. అంగన్‌వాడీల సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. స్పష్టమైన హామీ ఇచ్చినప్పుడే సమ్మె విరమిస్తారని, అప్పటి వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ఆందోళన చేస్తున్న అంగన్ వాడీ సిబ్బంది

నందినికి అభిందల వెల్లువ



అగసర నందిని

మునిపల్లి(అందోల్): ఆసియా క్రీడల్లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో అగసర నందిని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించడంతో ఆమెకు అభినందనలు వెలువెత్తుతున్నాయి. సోమవారం మండలంలోని బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ ఆరా, వైస్ ప్రిన్సిపాల్ పార్వతి అభినందించారు. నందిని ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించడం తమ కళాశాలకు గర్వకారణమని ఫిజికల్ డైరెక్టర్ జి.రమాదేవి తెలిపినట్లు వారు తెలిపారు.

ఏక్తా 86 సంస్థకు విరాళం

పటాన్‌చెరు టౌన్: సమాజ సేవ చేస్తున్న ఏక్తా 86 సంస్థకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావించి సమాజానికి ఏక్తా 86 సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సంస్థలో తాను కూడా సభ్యుడుగా చేరడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

కార్మికుల ఆందోళన

సంగారెడ్డి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం గాంధీ చిత్ర పటానికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.

సీపీఐకి రాజీనామా

జహీరాబాద్ టౌన్: సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.నర్సింహులు పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేశారు. రాజీనామ పత్రాన్ని పార్టీ జిల్లా కార్యదర్శికి పంపారు. వ్యక్తిగత సమస్యల కారణంగా రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఇందిర పాలనలో గల్లికో బడి'

మాజీ మంత్రి చంద్రశేఖర్



హద్నూరలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనలో గల్లికో వీధి బడి ఏర్పాటు చేస్తే, ఇప్పుడు కేసీఆర్ పాలనలో గల్లికో బెల్ట్ షాప్ ఏర్పాటు చేశారని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం చీఫ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని న్యామతాబాద్, మొల్కన్‌పాడ్, హద్నూర్, రాంతీర్థ్, గుంజోటి గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా రేజింతల్ శ్రీ సిద్ధివినాయక ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ వార్డు సభ్యులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి మెడలో పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ పాలనలో వీధికో బడి ఏర్పాటు చేశామని, నేడు గల్లీకో బెల్ట్ షాపు ఉందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తాను కూడా తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అవి అమలు చేయడం లేదని ఆరోపించారు. పేదల పొలాలను స్వాధీనం చేసుకున్నారని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్'

మాజీ స్కోర్ చైర్మెన్ పి.సంగమేశ్వర్



ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి(అందోల్): ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని మాజీ స్కోర్ చైర్మన్ పి.సంగమేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వట్‌పల్లిలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ జోషి, మాజీ జెడ్పీటీసీలు రాంరెడ్డి, నారాయణగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆందోళన



ఆర్డీఓ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



సంగారెడ్డిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జహీరాబాద్ టౌన్: మీడియా రక్షణ చట్టం, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని జహీరాబాద్‌లో జర్నలిస్టులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మహాత్మ గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. టీయూడబ్ల్యూజే జహీరాబాద్ అధ్యక్షుడు మీనాజ్ మాట్లాడుతూ మీడియా రక్షణ చట్టం, మీడిమా కమిషన్ ఏర్పాటు, అక్రిడెషన్ జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు పునరుద్ధరణ తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.

సంగారెడ్డి టౌన్: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి డిమాండ్ అన్నారు. సోమవారం ఐజేయూ పిలుపుమేరకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయంలో, గాంధీ విగ్రహాలకు వినతి పత్రం సమర్పించారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులకు ముందు..



మరమ్మతులు చేసిన తర్వాత..

సాక్షి ఎఫెక్ట్...

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం-జంగంపేట గ్రామాల మధ్య శివాలయం సమీప ప్రధాన రోడ్డు వర్షాలతో దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. 'ఆదమరిస్తే అంతే' శీర్షికన ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ కల్వర్ట వద్ద బ్రిడ్జిని నిర్మించేందుకు రూ.3 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ అధికారి రవీందర్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **రక్తదాన శిబిరానికి స్పందన**

నారాయణఖేడ్: మహాత్మా గాంధీ, మాజీ ఎమ్మెల్యే దివంగత పట్లోళ్ల కిష్టారెడ్డి జయంతి పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో కిష్టారెడ్డి కుమారుడు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాస ఆవరణలో సోమవారం పీకేఆర్ ట్రస్టు, లయన్స్‌క్లబ్ ల సౌజన్యంతో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ, కిష్టారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి రక్తదాన శిబిరం ప్రారంభించారు. శిబిరంలో వంద మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

◆ **క్రీడల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 9వ జాతీయ స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ **స్థల పరిశీలన**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మురుగు కాల్వలేక పడుతున్న ఇబ్బందులను వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం చైర్మన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వార్డులో పర్యటించారు. కాల్వ నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. త్వరలో మురుగు కాల్వ నిర్మాణం ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

◆ **రోడ్డుకు మరమతులు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామ సమీప నవనాథ్ సిద్దిలింగేశ్వర ఆలయానికి వెళ్లే రోడ్డు దెబ్బతింది. దీంతో ఆ గ్రామ సర్పంచ్ మారుతి యాదవ్ సొంత డబ్బుతో బాగు చేయించారు. రోడ్డు దెబ్బతినడంతో ఆలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డుకు మరమ్మతులు చేయించడంతో గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ **కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

వట్‌పల్లి(అందోల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యమిత్రి నెట్‌వర్క్ కె.హిమగిరి ప్రసాద్ అన్నారు. సోమవారం జోగిపేటలోని ఇందిరానగర్ కాలనీలో, అందోల్ బస్తీ దవాఖాన వద్ద గ్రామ సభలను నిర్వహించి ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యశ్రీ, ఏబీపీఎంజెఏవై కార్డును ఆరోగ్యమిత్రి వద్ద ఈకెవైసీ చేయించుకొని ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు రిజ్వాన్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **వినాయక నిమజ్జనం**

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రంలో సుందరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ గణనాథుడి విగ్రహ నిమజ్జనోత్సవం సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో యువకులు భక్తి పాటలు పాడుతూ సందడి చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



◆ **పారిశుధ్య కార్మికులకు సన్మానం**

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ పంచాయతీ కార్మికులను ఉపాధ్యాయుడు సోమవారం సన్మానించాడు. పారిశుధ్య కార్మికులు సురేశ్, శంకర్, దాస్‌ను అల్గోల్ ప్రభుత్వ పాఠశాల మల్లయ్య స్వామి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి వసంత, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



◆ **పనికి తగ్గ వేతనం ఇవ్వాలి**

పటాచెరు టౌన్: ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమ్మెలో భాగంగా పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆశా వర్కర్లు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వారికి కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు.

కంది(సంగారెడ్డి): ఆశా వర్కర్లకు కనీసవేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 8వ రోజుకు చేరింది. సమ్మెలో ఆశా వర్కర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు ఎమ్మెల్యే పర్యటన**

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ సోమవారం తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపూర్, బుదేరా, ఖమ్మంపల్లి, బోడ్పుట్‌పల్లి లింగంపల్లి, తాటిపల్లి, మగ్దుంపల్లిలో అభివృద్ధి పనులను శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు.

